# 39. రాజావారి పవిత్రత

హిజ్ హైనెస్ వగైరా బిరుదాంకితులైన అల్వార్ మహారాజావారు తాను సాక్షాత్తూ శ్రీరామచంద్రులవారి వంశీకుడనని మనసా వాచా నమ్మి అందు కనుగుణంగా నడుచుకునేవారు. ఫలితంగా శ్రీవారి దినచర్యకు అనేకానేక పరిమితు లుండేవి. రాజుగారు తలుచుకుంటే తన్నులకేం కొదవ ఉండదు గనుక శ్రీవారి ఆచారాలు, నమ్మకాలు అన్నీ నిర్విఘ్నంగా కొన సాగిపోతుండేవి.

అలా కాలం గడిచిపోతూ ఉండగా ఇంగ్లాండులో జరిగే రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు శ్రీవారికి ఆహ్వానం వచ్చింది. ఈ పవిత్ర ఆర్య భూమినుండి ఆ తుచ్ఛ మ్లేచ్ఛభూమికి పోవటం శ్రీవారికి ఎంతమాత్రం ఇష్టంలేదు. కానీ రాజకీయంగా అలా రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు ఆహ్వానం అందటం అనేది గొప్ప గౌరవం క్రింద లెక్క. కనుక శ్రీవారు తన మడి మర్యాదలు సక్రమంగా సాగిపోయేలా ఏర్పాట్లు చేసుకుని తప్పనిసరై బయలుదేరారు.

తీరా ఇంగ్లాండ్ చేరాక మరో సమస్య ఎదురయింది.

ఆ రౌండ్ టేబిల్ కాన్ఫరెన్సుకు ఏతెంచిన రాజాధిరాజుల గౌర వార్థం కింగ్ జార్జి ప్రభువూ, ఆయన సతి క్వీన్ మేరీ బకింగ్ హాం ప్యాలస్‌లో ఘనమైన విందు ఏర్పాటు చేశారు. దానికి మన అల్వార్ మహా రాజావారినీ సగౌరవంగా ఆహ్వానించేరు.

మ్లేచ్ఛుల విందులకు పోవటం మహారాజావారికి ఇష్టంలేదు. కానీ వెళ్ళక తప్పదు.

అదలా ఉండగా శ్రీవారికి మరో మహత్తర సమస్య ఎదురయింది.

భారతదేశంలో అయితే ఎంత గొప్పవ్యక్తికయినా చేతులు జోడించి అభివాదం చేయవచ్చు. లేదా సగౌరవంగా వంగి అయినా ఎదుటివారి గౌరవాన్ని మన్నించవచ్చు.

కానీ, ఇక్కడ అలాగాదు. చేయీ చేయీ కలిపి షేక్‌హ్యాండిస్తేనే మర్యాద. గొప్పవాడినయినా, చిన్నవాడినయినా కలిసినపుడల్లా తప్పని సరిగా పాటించాల్సిన ఆచారమది.

కానీ, మ్లేచ్ఛులను ముట్టుకోవటం, అందునా వారి హస్తాల్ని పట్టుకుని ఒకటికి నాలుగుసార్లు గట్టిగా ఊపవలసి రావటం శ్రీవారికి సుతారం ఇష్టంలేదు. అలా చేయటమంటే మ్లేచ్ఛ సంపర్కంతో అపవిత్రమయి పోవటమేనని శ్రీవారి దృఢాభిప్రాయం.

పవిత్ర భారతభూమిపై ఉండగాకూడా శ్రీవారికీ సమస్య ఎదురయి ఉండకపోలేదు. వైస్రాయి, బ్రిటిష్ రెసైడెంటులాంటి మ్లేచ్ఛులను కలుసుకోక పోలేదు. అయితే ఆయా సందర్భాలలో శ్రీవారు ముందే జాగ్రత్తపడి చేతులకు గ్లోవ్స్ తొడుక్కోవటం ద్వారా మ్లేచ్ఛుల్నెందర్ని కలసి షేక్‌హ్యాండ్లిచ్చినా వారి స్పర్శా సంపర్కదోషం తగలకుండా కాపాడుకో గలిగేరు.

అయితే ఆ కిటుకు ఇక్కడ ఇంగ్లండులో, అందునా రవియస్తమించని మహా సామ్రాజ్యాధినేత కింగ్ జార్జి సమక్షంలో చెల్లనేరదని మహా రాజావారి అలవాట్లు అంతకుముందే తెలుసుకుని ఉన్న బకింగ్ హాం ప్యాలెస్ అధికారులు మర్యాదగా సెలవిచ్చి ఉన్నారు.

ఎందుకయినా మంచిదని మహారాజావారు ముందుగానే లార్డ్ ఛాంబ ర్లేన్‌కు "అయ్యా నేను విందుకు హాజరయినపుడు చేతులకుగ్లొవ్స్‌లేకుండా కింగ్ జార్జ్ ప్రభువులవారిని గాని మరెవరినిగాని ముట్టుకోలేను, షేక్‌హ్యాం డ్లివ్వలేను అనికూడా కబురంపుకుని ఉన్నారు.

ఆ కబురు విని క్వీన్ మేరీ ఆగ్రహోద్ధగ్గులవగా, కింగ్ జార్జివారేమో మహాశ్చర్యపడిపోయి సదరు మహారాజపుల్లయ్యను సగౌరవంగా ఇండి యాకు సాగనంపి వేయటం భావ్యంగా ఉండగలదేమో అని సెల విచ్చేరుట.

ఆ సంగతి తెలిసి మహారాజావారు నీరుగారి పోయేరు. కింగ్ జార్జ్ వారి ఆగ్రహానికి గురి కావటమంటే సామాన్యమా మరి. అందుమీదట శ్రీవారు దీర్ఘాతి దీర్ఘంగా ఆలోచించి ఒక మహాద్భుత ప్రణాళికను సిద్ధం చేసుకుని ఆ తర్వాత సంతోషంగా ఓ నిట్టూర్పు విడచి ఛాంబర్లేన్‌గారికి "ఓ, అలాగే, వస్తాను, షేక్‌హ్యాండ్లిస్తాను, మీరేం చింతించవలదు" అని కబురంపేరు.

ఆ తర్వాత మహారాజావారు అర్జంటుగా గంటకు అయిదొందల రూపాయల ఫీజు మాత్రం వసూలుచేసే లండన్‌లోకెల్లా సుప్రసిద్ధుడైన ఓ టైలర్ వద్ద కేగేరు.

అతనితో కొన్ని గంటలసేపు గ్లోవ్స్, అవి ఎట్లు తయారగును? ఎట్లెట్లు తయారుచేయ వీలుగలదు, సెకండ్లలో ఆటోమాటిక్‌గా ఊడదీసి మరలా తొడుగుకోగల్గే నూతన పద్ధతి ఏదేని గలదా? ఇత్యాది సాంకేతి కాంశాలను క్షుణ్ణంగా చర్చించేరు.

ఆ తర్వాత మరో రెండు గంటల్లో అపూర్వమైన ఆటోమాటిక్ గ్లోవ్స్ తయారయి పోయేయి.

మహారాజావారున్నూ నిశ్చింతగా విడిది కేగి సుఖంగా నిద్రబోయేరు ఆ గ్లోవ్స్ విషయం మాత్రం ఎవరికీ చెప్పకుండా రహస్యంగా ఉంచేరు.

ఆ మర్నాడు బకింగ్ హాంప్యాలెస్‌తో దాదాపు 500 మంది మహా మహుల మధ్య శ్రీవారున్నూ అతిథ్యాని కేతెంచేరు. మహారాజావారు గ్లోవ్స్ తొడుక్కుని ఉండటం అందరూ ప్రత్యేకంగా గమనించేరు. అయితే కింగ్ జార్జ్, క్వీన్ మేరీలకు పరిచయం చేయబడే సమయంలో శ్రీవారు ఎలాంటి ప్రయత్నం చేయకుండానే ఒకి చిన్న మీటను నొక్కేసరికి వారి చేతికున్న గ్లోవ్స్ వాటంతటవే ఊడి అంగీ చేతులలోపలి కెళ్ళిపోయేయి. షేక్ హ్యాండ్లివ్వగానే మరుక్షణం అదే విధంగా బయటికొచ్చి చేతుల్నలంకరించేయి.

అది గ్రహించిన కింగ్ జార్జివారూ, క్వీన్ మేరీవారూ సంతుష్టులయేరు. ఇతరులు మాత్రం సెకండ్లలో జరిగిపోయిన ఈ మార్పును గమనించలేక గ్లోవ్స్‌తోనే షేక్‌హ్యాండిచ్చారని భావించి "ఔరా! ఏమి, ఈ భారతీయ ప్రభువుల ఘనత'' అని ముక్కులమీద వ్రేళ్లేసుకొన్నారు.

ఆ విధంగా హిజ్ హైనెస్ ఇత్యాది సవాలక్ష బిరుదాంకితులైన అల్వార్ మహారాజావారు ప్రపంచం నలుమూలలనుండి విచ్చేసిన 500 మంది మహామహరాజ అతిథుల సమక్షంలో తన పవిత్ర సాంప్రదాయాలన్నా విధంగా కాపాడుకో గలిగేరు.

తర్వాత విడిదికేగాక మ్లేచ్ఛ స్పర్శాదోష పరిహారార్థం సిద్ధంగా ఉన్న ఆవుపేడ ఇత్యాదులతో శుద్ధి కార్యక్రమం వేదోక్తంగా జరిపించుకున్నారనుకోండి. అది వేరే సంగతి.

★